క్లుప్తంగా

శరవేగంగా అభివృద్ధి పనులు



మద్దివలసలో కొనసాగుతున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు

వంగర: మండలంలోని మద్దివలస గ్రామంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ నిధులుతో ప్రధాన రోడ్డులో సీసీ డ్రెయిన్(కాలువ) నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించారు. అలాగే సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలు కూడా చకచకా జరుగుతున్నాయి. దాదాపు రూ.60 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



చెరువు గట్టుపై మొక్కలు నాటుతున్న యువకులు

రాజాం సిటీ: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని వక్తలు అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన యువత కోనేటి చెరువు చుట్టూ శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ వంతు సాయంగా చెరువు గట్టుపై ఇలా మొక్కలు నాటుతున్నామని యువకులు రెడ్డి శ్రీనివాసరావు, జల్ల కృష్ణ తెలిపారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు.

పరామర్శ



జగన్నాథం కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్

సంతకవిటి: మండలంలోని మద్దూరుపేటకు చెందిన రక్షిత పథకం వాటర్‌మ్యాన్ వావిలపల్లి జగన్నాథం ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు శుక్రవారం కలిసి, పరామర్శించారు. అనంతరం జగన్నాథం మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ దాసరి దాలినాయుడు, రామారాయపురం మాజీ సర్పంచ్ ఎన్ని శ్రీనివాసరావు, వాసుదేవపట్నం వైఎస్సార్ సీపీ నేత పప్పల గణపతి ఉన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపర్చాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఆమదాలవలస కాలనీ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యంను వివిధ ప్రశ్నల ద్వారా తెలుసుకున్నారు. ఉపాధ్యాయులంతా బాధ్యతగా పనిచేయాలని, వెనకబడిన ప్రతీ విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.విజయమ్మ, ఉపాధ్యాయులు పి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. శుక్రవారం మండలంలోని బూరాడ, పారంపేట, ఉనుకూరు, మునకలవలస గ్రామ సచివాలయాలను సందర్శించిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరై, ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి రూరల్: మండలంలోని గొంగాడవలసలో నూతనంగా నిర్మిస్తున్న బంగారమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గొంగాడవలస సర్పంచ్ గొంగాడ రామ్మూర్తి, చింతాడ సర్పంచ్ బంకురు తిరుపతి, మండల జేసీసీ కన్వీనర్ టి.దామోధరరావు, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిదేవి సేవలో ఎమ్మెల్యే జోగులు



గాయత్రి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రికాలనీలో మూడు రోజులుగా జరుగుతున్న గాయత్రిదేవి యాత్రా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం ఎమ్మెల్యే కంబాల జోగులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు బాగా పండి, అందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్టా సత్యనారాయణగుప్త, కలమటి శంకర్ తదితరులు ఉన్నారు.

సక్రమంగా 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'



రాజయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మండలంలోని కంచరాం, రాజయ్యపేట, ఒమ్మి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. పథకం ద్వారా వస్తున్న వస్తుసామగ్రిని లబ్ధిదారులకు నేరుగా ఇవ్వరాదని, కేంద్రాల వద్దే వండి వడ్డించాలన్నారు. కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల పారదర్శకతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాప్‌లు ఏర్పాటు చేశాయని, అందులో లబ్ధిదారుల వివరాలు సకాలంలో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ ఉనికి కోసమే లోకేశ్ పాదయాత్ర



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: రాష్ట్రంలో టీడీపీ(తెలుగుదేశం పార్టీ) ఉనికి కాపాడేందుకే ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. శుక్రవారం మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఓ కార్యక్రమానికి వచ్చిన వారు విలేకరులతో కాసేపు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 95 శాతం మేర నెరవేర్చారని, 2024లో జరగనున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అధికార దాహం కోసం ఎవరెన్ని పాదయాత్రలు చేసినా ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కడతారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగు

- వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు



ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజాం: ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగు అని వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పరిధిలోని సారథి ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు)లో శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రతీ ఇంట్లోని ఆడపిల్ల ఉన్నత చదువులు చదవాలని, వారి చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆడపిల్లలంతా బాగా చదువుకుని, ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణించినప్పుడే దేశం అభివృద్ధి సాధించినట్లు అన్నారు. కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎటువంటి సాయం కావాలన్నా చేస్తామన్నారు. కళాశాలలో 12 మందికి పైగా లెక్చరర్లు ఉన్నారని, కార్పొరేట్ కళాశాలల్లో కన్నా మిన్నగా బోధిస్తున్నారన్నారు. అనంతరం గతేడాది ఇంటర్ ఫస్టియర్‌లో మంచి మార్కులు సాధించిన హేమలత, తనూజ, స్నేహలతలను బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి, లెక్చరర్లు డి.శ్రీరామమూర్తి, ఎస్.మోహనరావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, కళ్యాణి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: నియోజకవర్గంలో ఈ నెల 20వ తేదీ నుంచి 27 వరకు నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సోదరుడు పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ కుమారుడు వివాహ శుభకార్యానికి శుక్రవారం ఆయన రామభద్రపురం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి కులమతాలకతీతంగా ప్రభుత్వం చేసిన మేలు ప్రజలకు తెలయజేయాలన్నారు. గృహసారథులు నియామకం దాదాపు పూర్తి కావచ్చిందని చెప్పారు. ఆయన వెంటఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎన్ రాయులు, సీనియర్ నాయకులు కనిమెరక అప్పారావు, దర్రు పైడిరాజు, పెంకి భీమయ్య, తదితరులున్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

బొబ్బిలి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు పట్టణ గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, వివిధ హోదాలలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

సిరిమాను సిద్ధం



సిరిమానును సిద్ధం చేస్తున్న స్థానికులు

బొబ్బిలి రూరల్: మండలంలోని 13 గ్రామాలకు సంబంధించి కొత్త పోలమ్మ, పాత పోలమ్మ, నూకాలమ్మ తల్లి సంబరాలు ఈ నెల 28న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన సిరిమానును మండలంలోని భోజరాజపురం గ్రామంలో శుక్రవారం గుర్తించి, పూజలు చేశారు. పారాదిలో నిర్వహించే ఈ సంబరాలు 13 గ్రామాల ప్రజలకు చెందినవని, పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

గడ్డికుప్ప దగ్ధం



గడ్డికుప్పను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని నారసింహునిపేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఎస్. సత్యంనకు చెందిన గడ్డికుప్ప దగ్ధమైంది. పక్కనే గడ్డికుప్పలు ఉండడంతో స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. కార్యదర్శి ఉమాదేవి, రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని బాధితుడ్ని పరామర్శించారు.

డొంకినవలసలో అన్నదానం



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

బాడంగి: మండలంలోని డొంకినవలస రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన కృష్ణాలయ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆవు సత్యనారాయణ, సత్యవతి దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్నదానంలో డొంకినవలస, లక్ష్మీపురం, తెంటువలస, పెదపల్లి, పింద్రంగివలస, వీరసాగరం, తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మూగజీవాలకు వ్యాక్సిన్లు

- బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు



గొర్రెలకు వ్యాక్సిన్లు వేస్తున్న సిబ్బంది

తెర్లాం: మూగజీవాలైన మేకలు, గొర్రెలకు ఎటువంటి వ్యాధులు సోకుండా వ్యాక్సిన్లు వేయించుకోవాలని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ సభ్యుడు బొమ్మి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కూనాయవలస పంచాయతీ జన్నివలసలో గొర్రెలకు వ్యాధులు సోకకుండా పీపీఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో గొర్రెలకు వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడెల విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ



కుట్టులో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

బొబ్బిలి రూరల్: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపిక చేసిన 30 మంది మహిళలకు కుట్టులో శిక్షణ అందిస్తున్నారు. ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా 30 మంది మహిళలను రిజర్వేషన్, అర్హత ప్రాతిపదికన ఎంపిక చేసి శిక్షకురాలు లావణ్య శిక్షణ అందిస్తున్నారు. బ్యాచ్‌ల వారీగా ప్రభుత్వం మహిళలకు శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు కృషి చేస్తోందని శిక్షకురాలు లావణ్య తెలిపారు.

యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం



యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: పట్టణంలోని చీపురుపల్లి వీధిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని.. ఈ ప్రాంత రైతులు, వ్యాపారులకు మెరుగైన సేవలందించాలని బ్యాంక్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బందితో పాటు మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, మండల జేసీసీ కన్వీనర్ టి.దామోధరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అల్లు భాస్కరరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులతో పాటు సచివాలయం, చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్లను పరిశీలించి మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతనదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, సచివాలయ రికార్డులు పరిశీలించారు.

శివలింగ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

బాడంగి: మండలంలోని పిన్నవలసలో పార్వతీ పరమేశ్వరాలయంలో శివలింగ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న శివలింగ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా పాత శివలింగాన్ని జీర్ణోద్ధారణ చేయడం, కొత్త లింగాన్ని పునఃప్రతిష్ఠిస్తారు. బ్రహ్మశ్రీ అంపోలు ఉమామహేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో తొలిరోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, రక్షాబంధన్, యాగశాల ప్రవేశం, మండపారాధనలు, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, నీరాజనం, తదితర పూజలు నిర్వహించారు.

చురుగ్గా 'ఉపాధి' పనులు



సంతకవిటి: తాలాడలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి



రేగిడి: మునకలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

సంతకవిటి: మండలంలోని తాలాడ, గరికిపాడు, సంతకవిటి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని పనులను శుక్రవారం ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంటు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి పనులు చేసుకోవాలని తెలిపారు. ఇచ్చిన కొలతల మేర పనిచేస్తే గిట్టుబాటు వేతనం వస్తుందన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారినే పనులకు అనుమతించాలని సిబ్బందికి సూచించారు.

హైస్కూల్‌ను సందర్శించిన యునిసెఫ్ కన్సల్టెంట్



బాడంగి హైస్కూల్‌లో దివ్యాంగ బాలికతో మాట్లాడుతున్న కన్సల్టెంట్ శివకిశోర్

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను యునిసెఫ్ కన్సల్టెంట్ కె. శివకిశోర్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు స్కూల్ హెల్త్, వెల్‌నెస్ ప్రోగ్రాం ఏ విధంగా అమలు జరుగుతున్నదీ హెచ్‌ఎం ఎస్.త్రినాథరావుతో కలిసి పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని టాయ్‌లెట్స్, మధ్యాహ్న భోజన పథకం మెనూ, వంట సరుకుల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆరా తీశారు. అనంతరం దివ్యాంగ బాలికలు రాసిన నోట్ పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీరితో పాటు ప్రత్యేక టీచర్ ఈశ్వరరావు, రమేష్, సీఆర్పీ సర్వేశ్వరరావు, ఈడీ మోహనరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

రాజాం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని గాయత్రి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బుచ్చింపేట, కొండంపేట ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడి, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందన్నారు.
కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి



రాజాం: లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు



తెర్లాం: కుసుమూరులో నిర్వహించిన హౌసింగ్ డేలో పాల్గొన్న డీఈ అప్పయ్య

రాజాం: ప్రతీ పేదవానికి సొంతిల్లు ఉండాలన్నదే జగనన్న ఇంటి పథకం ముఖ్య ఉద్దేశ్యమని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొద్దాంలో ఉన్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన లబ్ధిదారులకు అన్ని విధాలా ప్రభుత్వం సాయం అందిస్తోందని, నిర్మాణ సామగ్రితో పాటు రుణ సదుపాయం కూడా అందించడం జరుగుతోందన్నారు. లబ్ధిదారులు కూడా ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తిచేసి, సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, పంచాయతీ సర్పంచ్ నక్క తవిటమ్మ, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఏపీఎం టి.దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సూచించారు. శుక్రవారం మండలంలోని చింతలపేట గ్రామంలో హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం సమకూరుస్తున్న గృహ నిర్మాణ సామగ్రి, రుణ సదుపాయం సద్వినియోగం చేసుకుని, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణం

తెర్లాం: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేయాలని బొబ్బిలి గృహనిర్మాణ శాఖ డీఈ పలగర అప్పయ్య అన్నారు. మండలంలోని కుసుమూరు జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజున సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. ఆ రోజుకి నిర్మాణాలన్నీ పూర్తవ్వాలని సూచించారు. ఆయనతో పాటు కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు, మండల గృహనిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు మీనాక్షి, తదితరులున్నారు.